సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 25 । జూలై । 2025



శ్రావణం... ఆధ్యాత్మిక తోరణం

శ్రావణం.. అంటే మహిళలు వరలక్ష్మీదేవిని నెలంతా మనసారా కొలిచే మాసం. శుక్రవారాల్లో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాలను ఆచరించడం ఆనవాయితీ.


8లో



సెలూన్లు, స్పా సెంటర్లలో తనిఖీలు

వ్యభిచార మూలాలు విస్తృతమవుతున్న తరుణంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కాకినాడలో సెలూన్లు, స్పా సెంటర్లలో గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు.

2.16 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 2,16,302 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద గురువారం సాయంత్రం 10.90అడుగులకు నీటి మట్టం చేరింది. గోదావరి డెల్టాకు 9,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జ్వాలాకు ఐదు స్వర్ణ పతకాలు



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న జ్వాలా

అమలాపురం రూరల్: ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ నుంచి అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లికి చెందిన మోర్త జ్వాలా ఐదు స్వర్ణ పతకాలు సాధించింది. 2023 బ్యాచ్‌కు చెందిన ఆమె బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్ చదివింది. అప్పట్లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన ఆమె ఒకేసారి ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకుంది. విజయవాడ గన్నవరంలో స్వర్ణ భారతి ట్రస్ట్‌లో గురువారం ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ 57వ స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, వీసీ శారద, విశ్రాంత ఐఏఎస్ అధికారులు వేణుగోపాల్, ఎం.హరిజవహర్‌లాల్ చేతుల మీదుగా ఈ పతకాలను అందుకుంది. నీలంరాజు గంగా ప్రసాదరావు కమల, శ్రీపరి శాయనాది మెమోరియల్, మణియట్లపూడి మెమోరియల్, అంబేడ్కర్, రాజా ఇమ్మానియేల్ రాయల్ కొండేటి స్వర్ణ పతకాలతో సత్కరించారు. జ్వాలా తల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా, తండ్రి ఐఈడీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. జ్వాలా ప్రస్తుతం బెంగళూర్‌లోని ఐఐఎంలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. జ్వాలాకు అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.

విధుల నుంచి తొలగింపు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముగ్గురు ఒప్పంద సిబ్బంది అన్యమతస్తులుగా గుర్తించి దేవస్థానం ఈఓ యర్రా వెంకటేశ్వరరావు వారిని విధుల నుంచి తొలగించారు. దేవస్థానంలో స్వీపర్లుగా పనిచేస్తున్న కె.అనుషాదేవి, ఆర్.సుబ్బలక్ష్మి, స్కావెంజర్‌గా పనిచేస్తున్న కె.నాగేంద్రబాబులను విధుల నుంచి పూర్తిగా తొలగించారు. ఈ ముగ్గురు ఉద్యోగులు అన్యమతానికి చెందిన వారని చూపిస్తూ కొంత మంది భక్తులు ఫొటోలు, వీడియోలతో సహా దేవస్థానం ఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని దేవదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచి ఆ ముగ్గురిపై విచారణ నిర్వహించారు. వారు అన్యమత కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఫొటోలు, వీడియోలు ఉండడంతో విధుల నుంచి తొలగించినట్లు ఈఓ తెలిపారు.

యాప్‌రే.. ఏమి హింస!

- చిరుద్యోగులకు సంకటంలా నిర్వహణ
- కూటమి పాలనలో సంక్షేమానికి తూట్లు
- తిరకాసు పెట్టేందుకే ముందుకు..

కపిలేశ్వరపురం: ఉన్నది ఊడపీకేలా.. పథకాలన్నీ అటకెక్కించేలా.. ఉద్యోగులను హింసించేలా.. పలు యాప్‌లతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రస్తుతం పథకాలు పొందుతున్న లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకో, ఇస్తున్న లబ్ధిని ఎగ్గొట్టేందుకో అన్నట్లు యాప్‌ల నిర్వహణ ఉంది. అంతేకాకుండా యాప్‌ల నిర్వహణతో ప్రభుత్వ, స్కీమ్ ఉద్యోగులు, సిబ్బందికి నరకం కనిపిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొబైల్ యాప్ తెరిచి ఎవరింటికి వెళ్లినా ప్రభుత్వం తమకేమి మేలు చేస్తుందమ్మా అని అడగడంతో ఉద్యోగులు సంతోష పడేవారు. ఇప్పుడు యాప్ తెరిచి ఇంటికెళ్తే సదరు ఉద్యోగి ఏమీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొంటుంది. తమపై యాప్‌ల భారాన్ని తొలగించాలంటూ అంగన్‌వాడీ తదితర చిరు ఉద్యోగులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆందోళనలను సైతం చేస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో 18,32,332, కాకినాడ జిల్లాలో 20,92,374, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 17,19,013 మంది జనాభా ఉన్నారు. కాగా వారిలో అత్యధికులు కూటమి ప్రభుత్వం యాప్‌ల నిర్వహణలో బాధితులే. ఏదో రూపంలో వారి నుంచి సర్వేల ద్వారా వ్యక్తిగత వివరాలను సేకరిస్తుండటంతో ఎప్పుడు ఏ లబ్ధి ఎగిరిపోతుందోనంటూ ఆందోళనలో ఉన్నారు. ఇక స్కీమ్ ఉద్యోగులు పనిభారంతో అల్లాడుతున్నారు. కాకినాడ జిల్లాలోని 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,986 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 1,05,996 మంది ప్రీస్కూల్ పిల్లలు, 11,610 మంది బాలింతలు, 10,573 మంది గర్భిణులకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలు పలు మార్లు యాప్‌లను రద్దు చేయాలని ధర్నా చేశారు.



ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలంటూ ఈ నెల 21న కపిలేశ్వరపురంలో సీడీపీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన లబ్ధిదారులు, అంగన్‌వాడీలు

కోనసీమ జిల్లాలోని 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,726 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలుండగా 86,296 మంది చిన్నారులు, 15,743 మంది గర్భిణులు, బాలింతలు ఉండగా, తూర్పుగోదావరి జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,536 మెయిన్, 26 మినీ మొత్తం 1,562 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వేల సంఖ్యలో అంగన్‌వాడీలు యాప్‌లతో యాతన పడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 135 పీహెచ్‌సీలు, 22 సీహెచ్‌సీలు, 7 ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. కాకినాడలో జీజీహెచ్, రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నాయి. ప్రభుత్వ, గ్రామీణ, అర్బన్ సీహెచ్‌సీల్లో 1,445 మంది హెల్త్ సెక్రటరీలు ఉన్నారు. 200 మంది ఏఎన్ఎంలు, 473 మంది స్టాఫ్ నర్సులు, 1232 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,396 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 480, కాకినాడ జిల్లాలో 450, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 165 ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. ఆయా సంస్థల్లో ఆరోగ్యపరమైన యాప్‌ల నిర్వహణతో సిబ్బంది పనిభారాన్ని మోస్తున్నారు.

ఆన్‌లైన్.. పరేషాన్

సామాన్య ప్రజలకు సేవలందించేందుకు అంగన్‌వాడీ, ఆశ, తదితర చిరు ఉద్యోగులు ఎప్పుడూ ముందుంటారన్నది కరోనా లాంటి విపత్కర కాలంలోనే నిరూపితమైంది. వారిని గౌరవంగా చూసుకోవాల్సిన కూటమి ప్రభుత్వం యాప్‌ల పేరుతో వేధిస్తుండటంతో తీవ్ర మానసిక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు 2.0 వెర్షన్ బాల సంజీవని యాప్‌లో కొత్త వర్షన్‌ను సవరించి ఏప్రిల్ 1వ తేదీ నుంచి కంపల్సరీ వర్కర్, హెల్పర్ ఫొటో తీసి, సబ్మిట్ చేసి, ప్రీ స్కూల్ పిల్లల ఫొటోలను కూడా ఇన్‌టైమ్‌లో తీసి సబ్మిట్ చేయాలంటున్నారు. వారికి సంబంధించిన మెనూ కూడా ఇన్‌టైమ్‌లో ఆన్‌లైన్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం సరకులను ఎప్పుడు పంపిస్తుందో తెలియని పరిస్థితుల్లో పీకపై కత్తిపెట్టినట్టు వెంటనే యాప్‌లో వివరాలను నమోదు చేయాలని చెప్పడాన్ని ఆయా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

ఎగ్గొట్టేందుకు పావులు కదుపుతూ..

పెన్షన్స్ ఎగవేతకు పెన్షన్స్ పేమెంట్ యాప్‌ను పావుగా ప్రభుత్వం ప్రయోగిస్తుంది. అర్హులకే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందించేందుకు ఈ యాప్‌ను వినియోగిస్తున్నట్టు పైకి చెబుతుంది. ఈ యాప్‌లో లబ్ధిదారుల వివరాలను జియో ట్యాగింగ్ చేయడం ద్వారా 300 మీటర్ల దూరం దాటి సొమ్ము తీసుకుంటున్న వారిని గుర్తించి మరికొన్ని ఆప్షన్స్‌ను పూర్తి చేసేలా చేస్తుంది. తర్వాత వారిని విచారించి పింఛన్‌కు అర్హులా కాదా అనే దానిపై దృష్టి సారిస్తుందన్న వాదన ఉంది.

పనిభారం.. నరకం

సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకే అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వలంటీర్లను విధులకు దూరం పెట్టి, వారి పనిభారాన్ని సచివాలయ ఉద్యోగులపై మోపింది. బ్యాంకు సిబ్బంది చేయాల్సిన ఖాతాకు ఆధార్ లింక్, ఈకేవైసీ వంటి పనులను, ఐటీ శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హోం సిటిజన్స్ గుర్తింపు సర్వేను, పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్ఎంఈ సంస్థల గుర్తింపు సర్వేలను, సహకార సంఘాల రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా సహకార సంఘాల సిబ్బంది రైతులకు ఈకేవైసీ చేయాల్సిన పనులను సైతం సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది.

ఫేస్ రికగ్నిషన్ సిస్టంతో అవస్థలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు గుడ్లు, పాలతో పాటు మరికొన్ని పౌష్టికాహార పదార్థాలను అందజేస్తున్నారు. ఆయా వివరాలను రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని బాల సంజీవిని యాప్‌లో, కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని పోషణ ట్రాకర్‌లో ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) యాప్ ద్వారా నమోదు చేయాలని ప్రభుత్వం చెబుతోంది. లబ్ధిదారుల మొబైల్ నుంచి వచ్చే ఓటీపీతో వివరాలు ఖరారు చేయాలి. ఆ ప్రక్రియను సాగించేందుకు తగిన సాంకేతిక పరికరాలను కానీ, సమయాన్ని కానీ కూటమి ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ముందుగా ఫీడ్ చేసిన లబ్ధిదారుల ఫొటో ఎలా ఉండేదో వర్తమానంలో కూడా అచ్చుగుద్దినట్టు ఉంటేనే యాప్‌లో వివరాలు నమోదవుతున్నాయి. వివాహమైనప్పుడు యాప్‌లో ఫీడ్ చేసిన ఫొటోతో కొన్నేళ్ల తర్వాత ముఖంలో వచ్చిన మార్పులను యాప్ అంగీకరించకపోవడంతో యాతన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీలకు ప్రభుత్వం తరఫున అప్‌డేటెడ్ సెల్‌ఫోన్లను ఇవ్వకపోవడంతో వారి సొంత ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుని యాప్‌లను వాడాల్సి వస్తుంది. ప్రభుత్వం నామమాత్రంగా ఇస్తున్న 2 జీబీ డేటా సరిపోకపోవడం, నెట్ సిగ్నల్స్ 5జీ కాకపోవడం లబ్ధిదారులను, అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతుంది.

సాంకేతిక దన్ను లేకుండా..



ఐసీడీఎస్ పరిధిలోని యాప్‌ల పట్ల లబ్ధిదారుల్లో సైతం వ్యతిరేకత వస్తుంది. యాప్‌లను రద్దు చేయాలంటూ తాము చేసిన ఆందోళనల్లో లబ్ధిదారులు సైతం పాల్గొన్నారు. సరైన సాంకేతిక దన్ను సమకూర్చకుండా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, లబ్ధిదారులకు ఫేస్ రికగ్నిషన్ సిస్టం నిర్వహణ సాధ్యం కాదు. సమస్యలపై రాష్ట్రపతికి లేఖ కూడా రాశాం.

– కె.కృష్ణవేణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, మండపేట

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి



విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ మాధవి, డీటీఓ శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం టౌన్: మోటారు సైకిళ్లపై కళాశాలలకు వచ్చే విద్యార్థులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ విధిగా ధరించాలని అమలాపురం ఆర్టీఓ కొత్త మాధవి తెలిపారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యానిధి కళాశాలలో బుధవారం జరిగిన రహదారి భద్రతా అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) దేవిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కళాశాలలకు మోటారు సైకిళ్లు వేసుకుని వచ్చే విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలను ఆర్టీఓ వివరించారు. జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలకు మోటారు సైకిళ్లపై వస్తే వారికి డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్ ఉన్నాయా వంటి వివరాలను ఆయా కళాశాలల యాజమాన్యాలు ఆరా తీయాలని సూచించారు. అలాగే తమ పిల్లలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులతో రహదారి భద్రతా సందేశాన్ని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహాయ కార్మిక అధికారిగా సుధామాధవి



అమలాపురం టౌన్: అమలాపురం కార్మిక శాఖ కార్యాలయంలో సహాయ కార్మిక అధికారిగా ఆదిమూలం సుధామాధవి బాధ్యతలు చేపట్టారు. ఇదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధామాధవి పదోన్నతితో సహాయ కార్మిక అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై కార్మికులకు అవగాహన కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వారు తక్షణమే 94925 55058 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మొదటి విడత డీసెట్ కౌన్సెలింగ్ పూర్తి

99 సీట్లకు 56 మంది మాత్రమే హాజరు

నల్లజర్ల: దూబచర్లలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగిన మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ముగిసినట్టు ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి తెలిపారు. డైట్‌కు కేటాయించిన 99సీట్లకు కేవలం 56మంది అభ్యర్థులు మాత్రమే హాజరై సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ప్రవేశ పత్రాలు తీసుకున్నారు. సీనియర్ అధ్యాపకులు ఎస్.రామసుబ్రహ్మణ్యం, కెఎస్‌బీకే రాజ్‌కుమార్, కె.సరోజని, ఏఎస్ ఆర్ ఆర్ గుప్తా ఈ సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొన్నారు.

డీఎడ్‌కు తగ్గుతున్న ఆదరణ

దూబచర్ల డైట్ కళాశాలకు 99సీట్లు కేటాయిస్తే కేవలం 56మంది మాత్రమే కౌన్సిలింగ్‌కు హాజరవడం చూస్తుంటే డీఎడ్‌కు ఆదరణ తగ్గుతున్నట్టు కనపడుతోంది. తరుచూ డీఎస్సీ నిర్వహించక పోవడం, డీఎడ్ శిక్షణ పూర్తయి ప్రైవేటు పాఠశాలల్లో రూ.7వేలు, రూ.8వేలకు పనిచేయడం ఇష్టం లేకపోవడం కారణాలుగా కనిపిస్తున్నాయి.

డాక్టర్ సీఎస్ఎన్ కాలేజ్ ఆఫ్ ఎలిమెంటరీకి అనుమతులు రద్దు!

డీఎడ్ ప్రవేశాలకు సంబంధించి భీమవరం సీఎస్ఎన్ కాలేజ్ ఆఫ్ ఎలిమెంటరీకి ఎస్.సీ.డి.ఈ. ఈ ఏడాది అనుమతులు రద్దు చేసింది. తొలుత ఆ కళాశాలకు చెందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన కూడా దూబచర్ల డైట్ కళాశాలలోనే ఏర్పాటు చేశారు. ఆ కళాశాలకు 71 సీట్లు కేటాయించారు. 17 నుంచి 24వ తేదీ వరకు జరిగిన మొదటి దఫా కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఎవరూ హాజరు కాలేదు. ఆ కళాశాలకు చెందిన 9మంది విద్యార్థులు దూబచర్ల డైట్ కళాశాలలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కన్వీనర్‌కు తెలియజేసి వారిని చేర్చుకోనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

రైతులకు 11 అంకెల డిజిటల్ నంబర్

అమలాపురం రూరల్: అగ్రిస్టాక్ డిజిటల్ ప్లాట్‌ఫారం ద్వారా రైతులకు 11 అంకెల డిజిటల్ నంబర్‌ను కేటాయిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం అమలాపురం కలెక్టరేట్ నుంచి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అగ్రిస్టాక్ ప్లాట్‌ఫామ్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ ఆధారిత సేవలను ఒకే తాటిపైకి తెచ్చి కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వ పథకాలు అందించడం ఈ డిజిటల్ ప్లాట్‌ఫారం ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయండి

కోటిపల్లి – నరసాపురం రైల్వే లైన్ జాయింట్ సర్వే ప్రక్రియను ఇటీవల కోర్టు తీర్పునకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. రైల్వే, రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడుతూ సర్వే పురోగతి, భూసేకరణ ప్రక్రియలో అడ్డంకుల పరిష్కార స్థితిగతులు, నష్ట పరిహారం చెల్లింపు అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే పాత, కొత్త అలైన్‌మెంట్ల ప్రకారం సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ నిషాంతి, ఆర్డీఓలు కె.మాధవి, పి.శ్రీకర్, రైల్వే శాఖ గుంటూరు ఉప ముఖ్య ఇంజినీర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

స్వాతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

వచ్చే నెలలో జరిగే స్వాతంత్ర దినోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. ఈ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. స్థానిక బాలయోగి స్టేడియంలో పెరేడ్ నిర్వహణ, జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందన్నారు.

చించినాడ బిడ్జిపై నేటి నుంచి రాకపోకల నిషేధం

అమలాపురం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా ఎలమంచిలి మండలం చించినాడ– దిండి బిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ బిడ్జిపై అత్యవసర మరమ్మతుల నిమిత్తం మోటారు సైకిళ్లు, చిన్న కార్లు, ఆటోలకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. కత్తిపూడి నుంచి నర్సాపురం, భీమవరం వైపు ప్రయాణించే భారీ వాహనాలు కత్తిపూడి– జగ్గంపేట, రాజమహేంద్రవరం, పాలకొల్లు, నర్సాపురం నుంచి భీమవరం వెళ్లాలని సూచించారు. కాకినాడ నుంచి నర్సాపురం, భీమవరం వైపు వెళ్లేవారు రావులపాలెం సిద్ధాంతం మీదుగా వెళ్లాలన్నారు. కాకినాడ, రామచంద్రపురం, మండపేట నుంచి వెళ్లేవారు రావులపాలెం సిద్ధాంతం మీదుగా పాలకొల్లు నర్సాపురం, భీమవరం చేరుకోవాలన్నారు. అమలాపురం నుంచి నర్సాపురం, భీమవరం వైపు వెళ్లేవారు అమలాపురం, కొత్తపేట, రావులపాలెం సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నరసాపురం మీదుగా భీమవరం చేరుకోవాలన్నారు. తాటిపాక, రాజోలు నుంచి నర్సాపురం, భీమవరం వైపు వెళ్లేవారు తాటిపాక, పి.గన్నవరం ఈతకోట సిద్ధాంతం, పాలకొల్లు, నరసాపురం మీదుగా భీమవరం వెళ్లాలన్నారు. యానాం నుంచి బయలుదేరే వారు ద్రాక్షారామ, రావులపాలెం, సిద్ధాంతం, పాలకొల్లు, నర్సాపురం, భీమవరం చేరుకోవాలన్నారు. నరసాపురం నుంచి రాజోలు వైపు వెళ్లేవారు భీమవరం, పాలకొల్లు, సిద్ధాంతం, రావులపాలెం మీదుగా రాజోలు చేరుకోవాలన్నారు, నర్సాపురం నుంచి రాజోలు బయలుదేరే వారు దిగమర్రు, పాలకొల్లు, సిద్ధాంతం, రావులపాలెం మీదుగా రాజోలు వెళ్లాలన్నారు.

ఆర్టీసీ బస్సుల మళ్లింపు

చించినాడ వంతెనపై మరమ్మతుల కారణంగా శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సుల రూట్లను మళ్లించారు. చించినాడ బ్రిడ్జిపై నుంచి పాలకొల్లు మీదుగా వెళ్లే ఆర్టీసీ సర్వీసులు వయా రావులపాలెం, సిద్ధాంతం, పెనుగొండ, మార్టేరు, మీదుగా నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రాఘవకుమార్ తెలిపారు. అమలాపురం – శంషాబాద్, అమలాపురం – భీమవరం, రాజోలు – శంషాబాద్ బస్సులు వయా జగ్గన్నపేట, గన్నవరం, గంటి, రావులపాలెం, మీదుగా వెళ్తాయని వివరించారు.

అదను దాటితే సుఖమేమి?

- ఖరీఫ్ పనులకు అందని సాయం
- పెట్టుబడులకు అన్నదాత సతమతం
- ప్రైవేటు రుణాలే దిక్కవుతున్న వైనం
- అన్నదాతా సుఖీభవ విడుదలలో మౌనం
- గత ఏడాది రూ.340 కోట్లకు ఎగనామం



కరప మండలం వాకాడలో వరినాట్లు వేస్తున్న రైతులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నమ్మించి నట్టేట ముంచడంలో చంద్రబాబు మరోసారి తన నైజాన్ని చాటుకున్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటే మరచారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూశారు. కానీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బయట వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెట్టి వచ్చిన పంటలు విక్రయించి బాకీలు తీర్చారు. ప్రస్తుతం రెండో ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలై నెలరోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా పెట్టుబడి సాయం మాత్రం అందించలేదు. ఇప్పటికే రైతులు పెట్టుబడులు కోసం బయట వ్యాపారుల వద్ద అప్పులు చేసుకుని సాగు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం తమ వాటా రూ.2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమ చేసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నగదుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై చంద్రబాబు సర్కార్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. మే నెలలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని ప్రకటించి రెండు నెలలైనా ఇంకా పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు జోరందుకుంది. జిల్లాలో ఈ ఏడాది 2.10 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా ఇప్పటికే సుమారు 60 వేల ఎకరాల్లో రైతులు వరినాట్లు సైతం వేసుకున్నారు. మరికొందరు రైతులు వరినారు సిద్ధం కావడంతో నాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం రైతులకు కూలీకి, దమ్ములు చేయించుకొనేందుకు పెట్టుబడి సాయం ఎంతో అవసరం. ప్రస్తుతం ఎకరా సాగు చేసే రైతుకు రూ.9 వేలు పైనే పెట్టుబడి అవసరం కానీ ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ కూడా ఆర్థిక సహాయం లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. రైతులను చంద్రబాబు చిన్న చూపు చూస్తున్నారని, అందుకే గత ఏడాది అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదని రైతులు మండిపడుతున్నారు.

1.70 లక్షల మందికి అందని సాయం

తాను అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలు రైతులకు పెట్టుబడి సాయం చేస్తానని చెప్పి గత ఏడాది ఒక్క రూపాయి ఇవ్వలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా సహాయం మాత్రం అందలేదు. ఇప్పటికే గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హుల జాబితా అయితే సిద్ధం చేశారు. పథకం మాత్రం అమలు చేయడం లేదు. గత ఏడాది జిల్లాలో రైతులకు రూ.340 కోట్ల మేర ప్రభుత్వం ఎగనామం పెట్టింది. ఈ ఏడాది ఎప్పుడు తమ ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు పడతాయా అని ఎదురుచూస్తున్నారు.

అన్నదాతా సుఖీభవ కోసం ఎదురుచూస్తున్న రైతుల వివరాలు

నియోజకవర్గం	రైతులు
కాకినాడ రూరల్	28,088
తుని	33,046
ప్రత్తిపాడు	39,581
పెద్దాపురం	17,345
జగ్గంపేట	30,036

ప్రైవేటు వ్యాపారులే దిక్కు

ఈ ఖరీఫ్‌లో కూడా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకపోవడంతో సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ప్రయివేటు వ్యాపారస్తులు వద్ద నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని పొలం పనులు చేసుకొంటున్నారు. దమ్ములు, ఎరువుల కొనుగోలు, వరినాట్లు వేసిన కూలీలకు కావాల్సిన డబ్బులు మొత్తం ప్రైవేటు వ్యాపారుల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది వచ్చిన లాభమంతా వడ్డీలు కట్టేందుకే సరిపోయిందని, కనీసం ఈ ఏడాది అయినా ప్రభుత్వ సహాయం అందితే బాగుండునని రైతులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

జగన్ హయాంలో ఆర్థిక భరోసా

ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గత ప్రభుత్వం సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. దీనిలో కేంద్ర ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇచ్చే రూ.6 వేలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7500 కలిపి మొత్తం రూ.13,500 చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. జిల్లాలో రెండు లక్షలకు పైగా ఉన్న రైతులకు ఈ ఐదేళ్లలో కేవలం ఈ పథకం ద్వారానే రూ.1121 కోట్లు లబ్ధి చేకూరింది. సంక్షేమ క్యాలెండర్‌లో చెప్పిన విధంగా రైతులకు క్రమం తప్పకుండా రైతు భరోసా నిధులు జమ చేశారు. ఖరీఫ్ రైతులు పెట్టుబడులు కోసం మే నెలలో మొదటి విడగా నిధులు జమ చేయడంతో రైతులు ఎంతో ఉత్సాహంగా సాగు చేసుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాది మోసం చేసిన చంద్రబాబు ఈ ఖరీఫ్‌లో ఇంకా ఆ పథకం ప్రస్తావనే తేవడం లేదు. అదును దాటిన తర్వాత పెట్టుబడి సాయం అందించినా ఏమీ ఉపయోగం ఉండదని రైతులు మండిపడుతున్నారు.


రాష్ట్ర ప్రభుత్వమే రూ. 20 వేలు ఇవ్వాలి



ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 20 వేలు కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఇవ్వాలి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. గత ఏడాది ఇవ్వాల్సిన సహాయాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టింది. ఇకనైనా ఈ ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.

– ఎర్నీడి సత్తిరాజు, రైతు జి. మేడపాడు, సామర్లకోట మండలం

రైతులను మోసగించిన ప్రభుత్వం



ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి రైతులను మోసం చేస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకుండా రైతులను అన్ని విధాలా మోసం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల రైతు భరోసా నిధులు ఎప్పటికప్పుడు రైతులు ఖాతాల్లో జమచేశారు.

– నున్న వెంకటేశ్వరరావు, రైతు, విజయరాయుడుపాలెం, కరప మండలం

క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయుడిపై విచారణ


పాఠశాలలో హెచ్ఎం పాపారావుపై విచారిస్తున్న అధికారుల బృందం

కడియం: దుళ్ల నంబరు–2 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యార్లగడ్డ పాపారావుపై పాఠశాల ఆవరణలో గురువారం అధికారుల బృందం విచారణ చేపట్టింది. స్కూల్‌లో ఎనిమిదేళ్లగా పనిచేసిన పాపారావు నిత్యం మద్యం తాగుతూ విధులకు హాజరయ్యే వారని, రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడం, ఇష్టారీతిన వ్యవహరించడంతో పిల్లలకు సరైన విద్య అందడం లేదని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్లకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు తిరుమలదాసు మాణిక్యం, కేఆర్ కిశోర్‌లు విచారణ చేపట్టారు. స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఫిర్యాదుదారుల నుంచి మౌఖికంగా, ప్రశ్నావళి రూపంలో వివరాలను సేకరించారు. దీనిపై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర మంత్రికి ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని మాజీ సర్పంచ్ గుర్రప్ప సత్యనారాయణ తెలిపారు. ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, కూటమి నాయకులు ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, కంటిపూడి శ్రీనివాస్, గోపి ప్రసాద్, కుపాకుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం


గ్రామస్తుల చేతిలో హతమైన కొండచిలువ

నల్లజర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక తుప్పల్లో బుధవారం రాత్రి పది అడుగుల కొండచిలువ కలకలం సృష్టించింది. ఇక్కడి పులి భాస్కరరావు ఇంటి సమీపంలో తుప్పల్లో కదలికలు రావడం చూసి పరిసర ప్రజల సాయంతో ఆయన కొండ చిలువను గుర్తించారు. తుప్పలు తొలగించి చూడగా కొండ చిలువ బయటకు వచ్చింది. దానిని యువకులు గునపాలతో పొడిచి చంపేశారు. ఆ ప్రాంతానికి ఎగువన అన్నీ ఉద్యాన తోటలే. కొంగువారిగూడెం నుంచి వచ్చే ఎర్రకాలువ కూడా ఉంది. అటవీ ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. గతంలో చిన్న చిన్న పాములు కనపడుతుండేవని, ఈ తరహా కొండ చిలువ రావడం ఇదే తొలిశారని గ్రామస్తులు అన్నారు.

శ్రావణం... ఆధ్యాత్మిక తోరణం

- నేటి నుంచి సౌభాగ్యాల కాలం
- వరలక్ష్మీ వ్రతాలకు మహిళల ఏర్పాట్లు
- ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్


అమలాపురంలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు (ఫైల్)


కల్యాణ మండపానికి అలంకరణ

అమలాపురం టౌన్/ కొత్తపేట/సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శ్రావణం.. అంటే మహిళలు వరలక్ష్మీదేవిని నెలంతా మనసారా కొలిచే మాసం. ఈ నెలలో వచ్చే శుక్రవారాల్లో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాలను ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవార్ల దేవస్థానాలు, ఆలయాలు ఈ నెల రోజులూ భక్తులతో కిటకిటలాడుతుంటాయి. సామూహిక లక్ష్మీదేవి వ్రతాలకు నిలయమవుతాయి. శ్రావణ మాసం ఈ నెల 25వ తేదీ శుక్రవారం నుంచి మొదలు కావడంతో జిల్లాలోని మహిళలు తమ వీలును బట్టి ఫలానా శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే నెల 8న శ్రావణ శుక్రవారం కావడంతో ఆ రోజు జిల్లాలో అధిక సంఖ్యలో మహిళలు వ్రతాలు జరుపుకొనేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ మాసమంతా ప్రతి ఇల్లూ ఓ ఆలయంగా మారి సాక్షాత్తు లక్ష్మీదేవి కొలువైనట్లుగా భావిస్తారు. ఇళ్లలో వరలక్ష్మీదేవి వ్రతాలే కాకుండా ఇక ఆలయాలు, పలు ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో మహిళలతో సామూహిక వ్రతాలు గావించే దృశ్యాలు ఆధ్యాత్మికతకు దర్పణం పడతాయి.

పండగలు.. పూజలు

శ్రావణ మాసంలో పలు పండగలు జరుపుకోనున్నారు. ఈ నెల 25న తొలి శుక్రవారం, వచ్చే నెల ఒకటో తేదీ రెండో శుక్రవారం, 8న మూడో శుక్రవారం, 15న నాలుగో శుక్రవారం, 22న ఐదో శుక్రవారం కావడంతో ఇళ్లలో వ్రతాలు, ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే మాసంలో ఆగస్టు 9న రాఖీ పౌర్ణమి, అదేరోజు జంధ్యాల పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, 15న శ్రీకృష్ణాష్టమి పండుగలు జరగనున్నాయి. ఈ మాసంలో మహిళలు మంగళగౌరీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. మాంగల్యానికి అధిదేవత అయిన గౌరీదేవిని ప్రతి మంగళవారం ఆరాధిస్తారు.

రూ.8 కోట్లకు పైగా వ్యాపారం

మూఢం కారణంగా 48 రోజులుగా అంతగా విక్రయాలు లేకపోవడంతో పలు వ్యాపారులు నిరాశ చెందారు. శ్రావణం ఆగమనంతో తమ వ్యాపారాలు ఊపందుకుంటాయని ఆనందిస్తున్నారు. పెళ్లిళ్ల ముహూర్తాలు, శుభ కార్యక్రమాలు లేకుండా ఉన్న పురోహితులు ఈ మాసంలో ఒక్కసారిగా బిజీ కానున్నారు. బంగారు దుకాణాలు, పువ్వులు, పండ్లు, మిఠాయి దుకాణాలు రద్దీగా మారనున్నాయి. ముఖ్యంగా పురోహితులు శ్రావణ మాసమంతా బిజీ అవుతారు. బంగారు రూపుల, పువ్వులు, పండ్లు, మిఠాయిల అమ్మకాలతో జిల్లాలో సుమారు రూ.8 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో దాదాపు 800 బంగారు దుకాణాల ద్వారా రూపుల విక్రయాలు జరుగుతాయి. వరలక్ష్మీదేవి వ్రతంలో బంగారు రూపు ఉంచితే స్త్రీల మాంగల్యపరంగా శుభం జరుగుతుందనేది నమ్మకం. అలాగే జిల్లాలో 1,200 వరకూ పూలు, పండ్ల దుకాణాలు ఉన్నాయి. వ్రతాల్లో అన్ని రకాల పువ్వులు, పండ్లు సమర్పించి లక్ష్మీదేవిని పూజించడం ఆనవాయితీ. దాదాపు రెండు వేలకు పైగా మిఠాయి (స్వీటు) దుకాణాల్లో అమ్మకాలు ఊపందుకోనున్నాయి.

అమ్మవార్ల ఆలయాలకు ముస్తాబు

రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో వేంచేసిన శ్రీబాలా త్రిపుర సుందరిదేవి ఆలయం, వంకాయల వారి వీధిలో వరలక్ష్మి దేవాలయం, అష్టలక్ష్మి దేవాలయాలను ముస్తాబు చేశారు. గాదాలలో వేంచేసిన గుడ్లగూబ సమేత శ్రీమహాలక్ష్మీదేవి ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది. అలాగే నగరంలో కోటిలింగాల, పుష్కర, సరస్వతీ, గౌతమ, వీఐపీ ఘాట్‌లకు పుణ్యస్నానాలు ఆచరించడానికి వేలాదిగా భక్తులు వస్తుంటారు. కానీ ఇప్పటి వరకూ ఘాట్లను శుభ్రం చేయకపోవడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు.

కల్యాణ మండపాలకు గిరాకీ

ఈ నెల 26 నుంచి శుభ ముహూర్తాలు ప్రారంభం **కానున్నాయి. ఇ**ప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న **వారు తమ పిల్లల** వివాహాలను ఈ ముహూర్తా**ల్లోనే అట్టహాసంగా** జరిపించాలని భావిస్తున్నారు. **ఎక్కడికక్కడ కల్యాణ** మండపాలు బుక్ అయిపో**యాయి. నూతన** వెరైటీ కల్యాణ మండపాలు, **సరికొత్త ఈవెంట్స్‌**ను బుక్ చేసుకుంటున్నారు. ఈ **ఏడాది నవంబరు** 27 వరకూ ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

ఈ మాసమంతా బిజీయే..



అసలే మూఢంతో ముహూర్తాలు లేక కొంచెం ఖాళీగా ఉన్న పురోహితులు శ్రావణ మాసంలో బిజీ కానున్నారు. వరలక్ష్మీదేవి వ్రతాలు, పూజలతో పురోహితుల ప్రాధాన్యం ఈ నెలలో బాగా పెరుగుతుంది. శ్రావణ మాసంలోనే పలు పండగలు రావడంతోపాటు పెళ్లిళ్ల సీజన్ కూడా మొదలు కావడంతో చేతినిండా పని ఉంటుంది.
–ఉపద్రష్ట నాగాదిత్య, పంచాంగకర్త, పురోహిత బ్రహ్మ, అమలాపురం

సౌభాగ్యాన్నిచ్చే శ్రావణం



స్త్రీలకు సౌభాగ్యాన్నిచ్చేది శ్రావణమాసం. స్త్రీల వ్రతాలన్నీ ఈ మాసంలోనే చేస్తారు. శుక్ర, మంగళవారాలతో పాటు, వివాహాది శుభకార్యాలు నిర్వహించడానికి మంచి మాసం. ఆ మేరకు పెళ్లి వారు ముందుగానే ముహూర్తాలు పెట్టించుకుని ఆ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు.
–పిడపర్తి రవికుమార్‌శర్మ, వేద పండితుడు, పలివెల, కొత్తపేట మండలం

అందరికీ మంచి రోజులే



వివాహ ముహూర్తాలు లేక సుమారు నెలా పదిహేను రోజులు ఖాళీగా ఉన్నాం. శ్రావణం ప్రారంభం కావడంతో సరికొత్తగా కల్యాణ మండపాలు, పచ్చి పూల మండపాలు, వధూవరులను తీసుకువచ్చే రాయల్ ఎంట్రీస్, స్టేజ్ ఎంట్రీస్‌ను పరిచయం చేస్తున్నాం. ఇప్పటికే చాలా ఆర్డర్లు వస్తున్నాయి. దీంతో తమలాంటి అందరికీ మంచి రోజులు రానున్నాయి.
–గొలకోటి మాధవరావు (మాధవ్), మాధవ్ ఈవెంట్స్, గొలకోటివారిపాలెం, కొత్తపేట మండలం

పూజలు ఆచరించడం పుణ్యప్రదం



శ్రావణ మాసం హిందువులకు అత్యంత శుభప్రదమైంది. ఈ మాసంలో ఆలయాల్లోని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించడం పుణ్యప్రదం. తమ కుటుంబాలు పదికాలాల పాటు చల్లగా ఉండాలని మహిళలు వరలక్ష్మీ వ్రతాలు, మంగళగౌరీ వ్రతాలు ఆచరిస్తారు. దీని ద్వారా లక్ష్మీకటాక్షం, సౌభాగ్య ప్రాప్తి లభిస్తుంది.
–చిన్న వెంకన్నబాబు, శ్రీమహాలక్ష్మి సమేత వేంకటేశ్వర పీఠాధిపతి, గాదాల

వాడపల్లి హుండీల ఆదాయం రూ.1.53 కోట్లు


వాడపల్లిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయ హుండీల ద్వారా రూ.1.53 కోట్ల ఆదాయం వచ్చిందని దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. 28 రోజుల అనంతరం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో గురువారం హుండీలను తెరిచారు. ఆయా హుండీల్లో భక్తులు చెల్లించిన నగదుతో పాటు స్వామికి చెల్లించిన ముడుపులను స్వామివారి వసంత మండపంలోకి తెచ్చారు. దేవస్థానం సిబ్బంది, అర్చకులు, స్థానికులు, సేవాదళం భక్తులు, శ్రీవారి సేవకులు నగదు, మొక్కుబడులను విభజించి లెక్కించారు. ఆలయంలో వేంకటేశ్వరస్వామివారి, విశ్వేశ్వర స్వామివారి హుండీల ద్వారా రూ.1.26,78,200, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.26,12,993 సమకూరింది. బంగారం 47 గ్రాములు, వెండి కిలో 600 గ్రాములు, 11 దేశాల కరెన్సీ నోట్లు 24 వచ్చినట్టు ఈఓ చక్రధరరావు తెలిపారు. ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయ హుండీల ద్వారా రూ.3,45,300 ఆదాయం వచ్చిందన్నారు. పర్యవేక్షణ అధికారులుగా కొత్తపేట మండలం మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానం ఏసీ అండ్ ఈఓ దారపు రెడ్డి సురేష్‌బాబు, దేవదాయ శాఖ రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ఆర్ ప్రసాద్, అర్చకులు, గ్రామస్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుల అరెస్ట్

కశింకోట: అనకాపల్లి జిల్లాలో తొమ్మిది చైన్ స్నాచింగ్ కేసుల్లో మైనర్‌తో సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.26 లక్షల విలువ చేసే 26 తులాల బంగారు నగలు, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపిన వివరాలు ఇలా.. నర్సీపట్నంలో నివాసముండే తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన కర్రి నానిరెడ్డి, ఎస్.రాయవరం మండలం వాకపాడు గ్రామానికి చెందిన సెలూన్ దుకాణం నిర్వాహకుడు తారుతురి రమేష్, మరో మైనర్‌తో కలసి జిల్లాలో పలుచోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ప్రధాన నిందితుడు నానిరెడ్డి రాజమహేంద్రవరంలో చదువు మానేసి నర్సీపట్నం వచ్చి తన తండ్రి ముత్తారెడ్డితో గ్రామాల్లో తిరుగుతూ వాయిదాల పద్ధతిపై ప్లాస్టిక్ సామాన్లు విక్రయించేవాడు. అనంతరం నర్సీపట్నంలో హోం నీడ్స్ మెటల్ దుకాణం నడుపుతూ పూర్తిగా నష్టపోయాడు. దీంతో ఫైనాన్స్ చేసిన వారు నగదు కోసం గొడవ చేస్తుండటంతో వారి ఒత్తిడిని తట్టుకోలేక యూట్యూబ్ చానల్‌లో మహిళల మెడలో బంగారు ఆభరణాలు దొంగతనం చేసే వీడియోలు చూసి ప్రేరణ పొందాడు. మిగిలిన ఇద్దరు నిందితులతో కలసి జిల్లాలోని ఐదు మండలాల్లో 9 చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో కశింకోటలోని భవానీకాలనీకి చెందిన భార్యాభర్తలు నడిచి వెళ్తుండగా, ఈ నెల 1న గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నాలుగు తులాల బంగారు తాడును లాక్కొని పరారయ్యారు. ఈ విషయమై కేసు నమోదు చేసి సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో మూడు బృందాలు దర్యాప్తు చేశారు. కశింకోట నుంచి నర్సీపట్నం వరకూ సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడిన పైనిందితులను తాళ్లపాలెం వద్ద పట్టుకున్నారు.

హిజ్రా స్థావరాలపై పోలీసుల దాడి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని యానాం బైపాస్ రహదారిలో ఉన్న హిజ్రాల స్థావరాలపై కోరంగి పోలీసులు దాడి చేసి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కథనం ప్రకారం.. యానాం బైపాస్ రహదారిలోని పెట్రోల్ బంకు నుంచి లచ్చిపాలెం ఆంజనేయస్వామి ఆలయం వరకూ రహదారి చెంతన హిజ్రాలు స్థావరాలు ఏర్పాటు చేసుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు హిజ్రాలను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచి బైండోవర్ చేశారు. హిజ్రాలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వారి జీవన విధానాన్ని మార్చుకోవాలని, హితబోధ చేశారు.

సెలూన్లు, స్పా సెంటర్లలో తనిఖీలు


కాకినాడలో ఓ స్పా సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాకినాడ క్రైం: జిల్లాలో వ్యభిచార మూలాలు విస్తృతమవుతున్న తరుణంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కాకినాడలో సెలూన్లు, స్పా సెంటర్లలో గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షణలో కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో నగర వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, పోర్టు పీఎస్ పరిధిలో ఉన్న సెలూన్లు, స్పా సెంటర్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేస్తున్నామని ఏఎస్పీ అన్నారు.

సినీ దర్శకుడికి మాతృ వియోగం


త్రివేణి

శంఖవరం: సినీ దర్శకుడు చంద్రమహేష్ మాతృమూర్తి ఉత్తరాది త్రివేణి (80) గురువారం మృతి చెందారు. కత్తిపూడి గ్రామంలో ఉంటూ శంఖవరం, కత్తిపూడి తదితర గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయురాలుగా పని చేశారు. అలాగే పలు సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలు అందించారు. చంద్రమహేష్ వృత్తి రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన ప్రేయసి రావే, చెప్పాలని ఉంది, అయోధ్య రామయ్య, జోరుగా హుషారుగా, హనుమంతు తదితర సినిమాలకు దర్శకుడిగా పనిచేశారన్నారు. త్రివేణి మృతదేహానికి ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అభిమానులు నివాళులు అర్పించారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రధానోపాధ్యాయుల సంఘ సభ్యులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ నూతన కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా 2025– 27 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెవ్వూరి రవి హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా కేవీ రమణారావు, ప్రధాన కార్యదర్శిగా ఐ.పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగిన శ్రీరామారావు, ఆర్థిక కార్యదర్శిగా పల్లి రాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా కోలా సత్యనారాయణ, జి.గణపతిరావు, కె.ఫణిశేఖర్, ఉపాధ్యక్షులుగా ఆర్.విజయదుర్గ, ఎం.చిమ్మరాజుదొర, జాయింట్ సెక్రటరీలుగా జేవీ శ్రీనివాస్, పి.వెంకట్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా జి.ప్రమీలరాణి, సీహెచ్ సుబ్బలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులతో ఎన్నికల పరిశీలకుడు చెవ్వూరి రవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులపై ఉన్నతాధికారులు పని ఒత్తిడి పెంచుతున్నారని, సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల 15 ఏళ్ల నుంచి ఎటువంటి ప్రమోషన్లు లేకుండా ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


పరమేశ్వర్ (ఫైల్)

తుని: రైలు నుంచి జారిపడి మహారాష్ట్ర వాసి గురువారం మృతి చెందాడు. ఆ వివరాల్లోకెళితే.. మహారాష్ట్ర రాష్ట్రం నాందేడ్ జిల్లా, రీసంగాన్ గ్రామానికి చెందిన పరమేశ్వర్ పాండురంగ్ వవర్ (45) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. నాందేడ్ నుంచి లారీపై అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి లోడ్ తీసుకొచ్చాడు. లారీని డ్రైవర్‌కు అప్పగించి తిరుగు ప్రయాణంలో భాగంగా నాందేడ్ వెళ్లేందుకు యలమంచిలిలో రైలు ఎక్కాడు. నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా చెస్, క్యారమ్స్ పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో ఎల్ఐసీ రాజమహేంద్రవరం ఎస్‌డీఎం సత్యనారాయణ సాహూ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ చెస్, క్యారమ్స్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఎల్ఐసీ రాజమహేంద్రవరం సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ అన్నారు. స్థానిక జేఎన్ రోడ్డులోని సూర్య గార్డెన్స్‌లో ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ క్యారమ్స్ అండ్ చెస్ 2025–26 సెలక్షన్ గురువారంతో ముగిశాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన 16 మంది క్రీడాకారులను త్వరలో జరగనున్న ఎల్ఐసీ ఆల్ ఇండియా టోర్నమెంట్‌కు ఎంపిక చేశారు. విజేతలను మేనేజర్ (పీఅండ్ఐఆర్) ఎం.పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ అభినందించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 82 మంది పాల్గొన్నారు. మాజీ ప్రపంచ చాంపియన్ ఎస్.అపూర్వ, మాజీ జాతీయ చాంపియన్ పి.నిర్మల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎల్ఐసీకి చెందిన స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ సభ్యులు సురేష్ జయరామన్, డీవీఎస్వీ శర్మ సౌత్ సెంట్రల్ జోనల్ ఆఫీస్ నుంచి పరిశీలకులుగా హాజరయ్యారు. అంతర్జాతీయ క్యారమ్స్ రిఫరీ షేక్ అబ్దుల్ జలీల్, అంతర్జాతీయ చెస్ ఆర్బిటర్ జీవీ కుమార్ పర్యవేక్షణలో పోటీ జరిగింది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఆటంకాలు వద్దన్నా..


బోడసకుర్రులో ప్రధాన కాలువను ఆనుకుని పక్కా భవన నిర్మాణ పనులు


ఎంట్రుకోన ఎంపీపీ స్కూల్ వద్ద కాలువ వెడల్పు తగ్గించి నిర్మిస్తున్న వంతెన

- కలెక్టర్ హెచ్చరిస్తున్నా బేఖాతర్
- ఇరిగేషన్ స్థలం ఆక్రమణ
- నిబంధనలకు విరుద్ధంగా వంతెన, భవన నిర్మాణం

అల్లవరం: ఎన్నో చిత్ర విచిత్రాలు.. మరెన్నో ఆక్రమణలు.. చూసిన వారు నోరెళ్లబెట్టేలా ఘటనలు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సాగు నీటి వ్యవస్థ తీరు చూస్తే అర్థమవుతోంది. కాలువలు ఎక్కడికక్కడే అధ్వానంగా ఉండడంతో ఇప్పటికే సాగునీరు అందక రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పుడేమో ఉన్న కాలువలను బక్క చిక్కేలా చేస్తున్నా ఆ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. స్వయానా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఇటీవల ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి, కాలువల వెంబడి ఆక్రమణలను తొలగించి శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని సూచించినా ఆ ఆదేశాలను ఎవరూ ఖాతరు చేయడం లేదు. ఆ వివరాల్లోకి వెళితే.. అల్లవరం మండలం బోడసకుర్రు పంచాయతీ ఐలావారివీధి సమీపంలో ప్రధాన కాలువను ఆనుకుని ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి రెండు అంతస్తుల భవనాన్ని యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. కూటమి పార్టీలకు చెందిన కొందరు ఈ నిర్మాణానికి పూనుకున్నట్లు సమాచారం. కాలువలకు సాగునీరు విడుదల చేసేనాటికి రెండు అంతస్తుల భవనం పునాది స్థాయిలో ఉంది. అప్పటి నుంచి నేటి వరకూ ఈ విషయం ఇరిగేషన్ అధికారులకు తెలియకుండా ఉంటుందా అనేది ప్రశ్నగా మారింది. కాలువ వెంట ఆక్రమణలు తొలగించాలని జిల్లా కలెక్టర్, జేసీలు ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నా ఆక్రమణ ఎక్కడా ఆగడం లేదు. ఇలా కాలువలను ఆక్రమించుకుని భవనాలు కడితే శివారు ప్రాంతాలకు సాగునీరు ఎలా అందుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదే కాలువపై ఎంట్రుకోన ఎంపీపీ స్కూల్ వద్ద ఇటీవల వంతెన నిర్మాణం చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా కాలువ వెడల్పును తగ్గించి పనులు చేస్తున్నారు. దీనివల్ల నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిందని రైతులు వాపోతున్నారు. కాలువలపై వంతెనలు, కల్వర్టులు నిర్మించేటప్పుడు ఇవన్నీ ఇరిగేషన్ అధికారులు చూడకపోవడం శోచనీయం. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం

బోడసకుర్రు ప్రధాన కాలువ అంచున రెండతస్తుల భవన నిర్మాణంపై ఇరిగేషన్ కన్జర్వేషన్ అసిస్టెంట్ చంద్రమౌళిని 'సాక్షి' వివరణ కోరింది. దీనిపై ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వారికి నోటీసులు ఇచ్చామన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఎంట్రుకోన వద్ద నిర్మిస్తున్న వంతెన గురించి ఇరిగేషన్ కన్జర్వేషన్ అసిస్టెంట్ శామ్యూల్‌ను అడగ్గా, ఈ నిర్మాణ పనులు పరిశీలించి, కాలువ వెడల్పు తగ్గినట్లు గుర్తిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇస్తామని చెప్పారు.